మెల్లిగా అడిగింది. "ఏంజరిగింది, బావా?" అని, సారధికి అసంగతమంతా ఎట్లాచెప్పాలో వోపట్టాన తట్టలేదు. చివరికి మజిలీలు మజిలీలుగా "జరిగిందంతా చెప్పి నే నిప్పుడే వొస్తాను" అని బైటకి వెళ్ళిపోయాడు.

• • •

అతర్వాత నాలుగైదు రోజులదాకా సావిత్రి, సారధి కలుసుకోలేదు. మాట్లాడు లేదు. గిల్లి కజ్జాలతో పసిపిల్లల్లా అల్లరి చేస్తూండే వాళ్ళిద్దరూ గంభీరముద్ర ధరించి, తప్పించుకు తిరగటం మొదటిసారిగా గమ నించింది రుక్మిణమ్మ. ఆవిడ కెంత ఆలో చించినా ఈ మిస్టరీ అంతు పట్ట లేదు. 'వొదిన' కేమన్నా తెలుసేమోనన్న ఉద్దే శ్యంతో సుభద్రమ్మని కదలేసింది. ఆవిడా వెర్రిమొహమే వేసింది. చివరికి సావిత్రినీ, సారధినీ అడిగి తేల్చుకోవటానికే నిశ్చ యం చేసుకున్నారు యిద్దరూను.

సావిత్రి తల్లి ఎంత అడిగినా మనసులో మాట చెప్పలేక పోయింది. అందులో చెప్పేందుకుమాత్రం ఏముంది? కాని రుక్మి ణమ్మ అలా వొదిలి పెట్టేరకం కాకపోవ టాన చివరికి కళ్ళ నీళ్ళతో జరిగిందంతా చెప్పింది. రుక్మిణమ్మ ముఖం దమ్మిడీ అంత ఐ పోయింది. ఎంత అప్రదిష్ట?

కొడుకునించి ఆరా తియ్యటానికి ప్రయ త్నించి పరాజయంపొందిన సుభద్రమ్మకి, రుక్మిణమ్మకూడా తననించి తప్పుకు తప్పుకు తిరగటం మరో మిష్టరీఐంది. చివరికి ఆవిడ తన మనసులోదంతా భర్తదగ్గిర వెళ్ళబోసు కుంది. ముకుందరామయ్యా నరసింహంతో వెళ్ళబోసుకున్నాడు.

ఆ రోజు మామూలుగా ఆఫీసునించి యింటికి వొచ్చిన సారధి యింట్లో అంతా అదోరకంగా ఉండటమూ, వొకళ్ళ నొకళ్ళు దొంగల్లాగా చూసుకోవటమూ, మునిమునిగా నవ్వుకోవటమూ గమనించి అయోమ యంలోపడి తన గదిలోకి వెళ్ళిపోయాడు. బట్టలు విప్పుతుండగా బల్లమీదవున్న కార్డు అతనికంటపడింది. రాత అపరిచితమైందిగా కనిపించి ఉత్తరం అందుకుని కిటికీదగ్గిరకి వెళ్ళాడు. ఆ ఉత్తరం తెనాలినుంచి వొచ్చింది. మామూలు మాటలు ఐనాక.... "మీ సంప్రదాయానికి మా సంప్రదాయానికి కుదరదనిపించినందున మీ సంబంధం మేము వొదులుకుంటున్నాము ..." అని ఉన్నది. సారధిముఖాన కత్తివేటుకి నెత్తురు లేకుండాపోయింది. ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపి బైటికివిసిరేసి పోబోతూ పెరటిలో నిలబడివున్న సావిత్రిని చూసి ఆగిపోయాడు.

సావిత్రి చిన్నగా నవ్వి తలదించుకుంది. సిగ్గుపడుతూ. అప్పటికిగాని అతని మనస్సు కుదుటపడలేదు. □□□

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపు లను జతచేసి పంపించాలని మనవి. రచన నతో పాటు కాక తరువాత స్టాంపులు పంప వద్దని, అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.



# కరుణామయులు

ఎమ్. సీతాగోపాల్



"రాజూ"

"అమ్మా"

"ఇవాళ బావ వస్తాడట స్టేషన్ కి వెళ్లాలి."

"నాకు వీలవదమ్మా"

"సరే నీ యిష్టం" అంటూ నిట్టూర్చింది రాజేశ్వరమ్మ.

చిన్నపాలేరు సోముల్ని పిల్చి బండి కట్టమని సిద్ధమై తనే స్టేషన్‌కి వెళ్ళింది.

అల్లుడు వస్తూంటే వుండవలసిన సంతోషం ఆమె ముఖంలో కన్పించదు. అవును ఎలావుంటుంది? చక్కగా కూతురుతో, కళకళలాడే సంసారంతోవస్తే ఆనందంగాని? పాలేరుని బండి ఏసమయానికి వస్తుందో ఎంతాలస్యంగా వస్తుందో కనుక్కురమ్మంది.

"అరగంట ఆలీశమవుద్దిటమ్మగోరూ" అని జవాబుచెప్పాడు సోములు. "బండి రాగానే ర"మ్మని పంపేసింది. ప్రయాణీకులకై ఏర్పరచబడిన బెంచీపై కూర్చుంది రాజేశ్వరమ్మ. రైలువస్తే అమ్మకం కోసం ఎదురుచూస్తున్న కిళ్ళీబడ్డీవాడు, కూలీలు చెదురుబదురుగావున్న ప్రయాణీకులను చూసింది. తనకు తెలిసినవారెవరూ లేరక్కడ. ఎంత నివారిద్దామన్నా వీలుకాకుండా ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

రాజేశ్వరమ్మకి ఇద్దరు కొడుకులు. ఒక్కత్తే కూతురు. రాజు పెద్దవాడు. తర్వాత మూడేళ్ళకు పార్వతి పుట్టింది. పార్వతి తర్వాత చాలాకాలానికి ప్రకాశం పుట్టాడు. రాజేశ్వరమ్మ భర్త యోగానందం స్థితిమంతుడవడంవల్ల, పార్వతి ఒక్కత్తే కుమార్తె అవడంవల్ల పార్వతి అన్నగారి గారాబంతోనూ, తమ్ముడితో చిలిపి తగూలేసుకుంటూను పెరిగి పెద్దదయింది.

పార్వతి చక్కనిపిల్ల. పచ్చటి నుదుటి మీద తుమ్మెదల్లా ముసిరే ముంగురులు చూస్తూంటే ఎవరికైనా సవరించబుద్దేస్తుంది. విశాలమైన సోగకళ్ల చూస్తూంటే ఆకళ్ళలో తమ ప్రతిబింబం చూసుకోవాలన్న కోర్కె కలుగకమానదు. సూటైన శిరీష పుష్పం లాంటి ముక్కు. రెండు దొంగవక్క పేర్చారా అనిపించే చిన్ననోరు. నవ్వితే బుగ్గమీద సొట్టతోపాటు తళుక్కుమనే తెల్లని పలువరుస. సన్నని నాజూకైన బుజాలవంపు యౌవనశోభతో పార్వతి చూవరులకు కనువిందొనరిస్తూండేది. అందంగా, చలాకీగా, తెలివిగా వుండే చెల్లెలంటే రాజుకి అంతులేని ఆపేక్ష. పార్వతికి అన్నయ్యంటే గౌరవం, ఆదరం. ప్రకాశం చిన్నవాడు; అక్కని విడిచి ఒక్కక్షణం వుండేవాడు గాదు.

ముత్యాల్లాంటి ముగ్గురు బిడ్డల్ని చూసుకుని మురిసిపోయేవారు తల్లిదండ్రులు. చూడ ముచ్చటగావుండేది రాజేశ్వరమ్మ సంసారం. పెళ్లీడు వచ్చిందని, తగినవరునికై ప్రయత్నం చేయమని పోరేది రాజేశ్వరమ్మ. "వస్తాడులేవే అల్లుడు. నిన్ను వెతుక్కుంటూ నేను రాలే? అలాగే మన బంగారుతల్లికోసం యెవడు పూజ చేశాడో?" అనే వారాయన గర్వంగాను పరిహాసంగాను. బంగారు కలాకలాంటి కూతుర్ని చూస్తే ఆయనకు అంతులేని వాత్సల్యం. భర్త అలా అనగానే తన పెళ్ళి వుదంతంగుర్తువస్తుంది రాజేశ్వరమ్మకి. యోగానందం స్నేహితుడు పరమశివంతో కలిసి వచ్చాడు ఆవూరికి. తలవని తలంపుగా ఆయన రాజేశ్వరమ్మను చూశారు. ఎన్ని సంబంధాలు వచ్చినా కాలదన్ని రాజేశ్వరినే చేసుకున్నారాయన. తాముతెచ్చిన సంబంధంతిరక్కొట్టి రాజేశ్వరిని చేసుకున్నందుకు కొంతకాలం గునిసినా దీపంలాగా వుండేకోడలు నట్టింట తిరుగుతూండేసరికి



కొడుకు చక్కని గుణవంతురాలైన కోడల్నే ఎంచుకున్నందుకు తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. రాజేశ్వరమ్మ అత్తయ్యాఅంటూ అత్తగార్ని క్షణమైనా విడిచిపెట్టేదికాదు. తీరికసమయాల్లో అత్తా కోడళ్ళిద్దరేకమై కబుర్లుచెప్పుకునేవాళ్ళు. ఆ సమయంలో యోగానందం పిలిచినా రాజేశ్వరమ్మ పలికేదిగాదు. ఆమె వంటరిగా చిక్కినప్పుడు "రాణీగారికి అత్తగారి గారం ఎక్కువై ఈ దీనుని పిలుపే చెవికెక్కడం లేదే" అని పరిహాసమాడేవాడు. ఇవన్నీ గుర్తువచ్చి రాజేశ్వరమ్మ మొహంమీద చిరునవ్వు వెలిసేది. నునుసిగ్గుకళ్ళలో తొంగిచూసేది. "పళ్లెండి. మన పెళ్ళి సంగతులిప్పుడెందుకు; పార్వతి పెళ్ళి సంగతి చూడండి. ఏ వయస్సు ముచ్చట్లు ఆ వయసులోనే జరగా" లంటూ వెళ్ళిపోయేది.

యోగానందంగారు వరునికై అన్వేషణ ప్రారంభించారు. ఎంతమందిని చూసినా తన కూతురికి ఈడుజోడైన అందమైన యువకుడు కన్పించలేదు. ఒక రోజు యోగానందం చిరుఎండలో పచారుచేస్తూండగా చిన్ననాటి స్నేహితుడు పరమశివం, అతని అన్నగారు శివరామయ్య కుమారుడు రాజశేఖరం వచ్చారు. అందరిని సగౌరవంగా ఆహ్వానించారు సరదాగా గడిపేవారు యోగానందం, ఆయన అతిథులూనూ. రాజశేఖరానికి ఏమీతోచేదికాదు. పెద్దవాళ్ళ ధోరణి వేరుగావుండేది. తనతో మాట్లాడే రాజు ఏదైనా పనిలోవుంటే అసలు తోచేది కాదు. చిన్నవాడు ప్రకాశంతో ఏం కబుర్లు చెబుతాడు?

4

మేష్టారు: "ఏమిట్రా, ఈ అంకె వెయ్యడం? ఈ నాలుగుచూడు? తొమ్మిదిలా వుంది."

కుఱ్రాడు : "అది తొమ్మిదేనండి."

మేష్టారు : "ఇది తొమ్మిదా? సరిగ్గా నాలుగులావుంది."

---

సాయంత్రం తోటలోకి వెళ్ళాడు శేఖరం. పొన్నచెట్టుక్రింద బండమీద కూర్చుని జాజులు గుచ్చుకుంటోంది పార్వతి. వేరే ధ్యానంలోవున్న పార్వతి శేఖరం రాకను గమనించలేదు. ఆ భంగిమలోనున్న పార్వతిని ఎంతచూసినా తనివి తీరలేదు శేఖరానికి.

ఏకాంతంలో నున్న పార్వతితో మాట్లాడాలనిపించి గొంతు సవరించుకున్నాడు. ఆ శబ్దానికి వెనుతిరిగిచూసిన పార్వతి బెదిరిన హరిణంలాగా మాల నక్కడే వదలివేసి రివ్వున పారిపోయింది. పార్వతి శేఖరాన్ని అసలు చూడకపోలేదు. ఏకాంతంలో ఈ అపరిచిత యువకుని చూడగానే, ఏదో సిగ్గు, బెరుకు ఆమెను పారిపోయేలా చేశాయి. ఒకరకంగా చూస్తే ఇది పెద్దవాళ్ళు చేసిన తతంగమేమో ననిపిస్తుంది. ఆమె వదిలేసిన

మాలతీసుతుని యింట్లోకినడిచాడు శేఖరం. రాజుకి విద్యావంతుడు, సుగుణవంతుడైన శేఖరమంటే మంచి అభిప్రాయంఏర్పడింది. యోగానందం శేఖర్ వినయవిధేయతలకు ముచ్చటపడ్డారు. చుట్టంచూపుగా వచ్చిన వాళ్లే సంబంధం స్థిరంచేసుకునివెళ్ళారు. రాజు పార్వతిని తెగవుడికించేవాడు. శేఖరం పేరుచెపుతే పార్వతి బుగ్గలు కందిపోయేవి. తనువు పులకెత్తేది. ఏవేవో వూహించుకుని తన్మయమొందేది. ప్రకాశానికి అందమైన బావమీదే ధ్యాసంతా.

చాలా వైభవంగా వివాహం జరిగింది. యోగానందం అల్లుడికి తగురీతిగా కట్నం, కానుకలు చదివించారు. పార్వతికి పుట్టింటి కట్నంకింద పొలం యిచ్చారు. అంతులేని వెండిసామాను, నగలు వచ్చాయి బహుమానరూపంగా. ఆరోజు తొలిరేయి. శేఖర్ మనస్సులో అంతులేని ఆనందం. పార్వతికి సంకోచం, సిగ్గు, అన్ని వేడుకలూ ముగిశాక దంపతులిద్దరూ ఏకాంతంలో మిగిలారు. శేఖర్ స్పర్శ మధురాతి మధురమై ఆనంద ప్రవాహంలో తేలియాడింది పార్వతి. అందచందాలలో వారిద్దరూ రతీమన్మధులనే మరపించారు.

తర్వాత పార్వతి కాపురానికి వెళ్ళింది. పార్వతికి అత్తగారులేదు. అంత యింట్లో తనూ, భర్త - మామగారూ కొంతమంది నౌకర్లూ, వంటపనిచేసేందుకు కనకమ్మా తప్ప వేరెవ్వరూలేరు. పార్వతి సాహచర్యంలో శేఖర్‌కి రోజులు క్షణాల్లాగా గడిచిపోయేవి. శేఖర్‌కి కనపడని క్షణం పార్వతికి యుగంగా తోచేది. అసలేమీ కాలక్షేపం వుండేదికాదు. తీరిక సమయాల్లో పార్వతిని వీణ వాయించమనీ, పాట పాడమనీ వేధించేవాడు శేఖరం. మురిపించుకుని పాడేది పార్వతి.

ఎప్పుడూ పూలరెమ్మల్లే చకాచకా ఇంట్లో తిరిగే పార్వతి ఆనాడు ఎంతకీ లేవలేదు. శేఖరం ఆదుర్దాగా పార్వతి మంచందగ్గరకు వెళ్ళి అడిగాడు ,సంగతేమిటని? పార్వతికి ఏం చెప్పాలో తోచక తలనెప్పి, వికారంగా వుందని చెప్పింది. తన తల్లితండ్రులను చూడాలనిపిస్తోందని చెప్పింది. పార్వతికి కులాసా లేకపోవడానికీ తల్లి తండ్రులను పిలిపించమనటానికి గల సంబంధం శేఖరానికి అర్ధంగాలేదు. కాఫీ యివ్వడానికి వచ్చిన కనకమ్మ "రాజబాబూ! అమ్మాయికి ఒంట్లో కులాసాలేదు. ఎండలో తోటలో దొడ్లలో తిప్పద్దు" అంటూ పార్వతిని సమీపించి "తల్లీ! కాస్త కాఫీతాగుతావా! పోనీ కొంచెం ఫలహారం చెయ్యి. ఏమీ తినకపోతే మరీ నీరసించిపోతా"వంటూ బ్రతిమాలింది.


అంతా అయోమయంగా తోచింది శేఖరానికి. పార్వతి తేచివెళ్ళింది ముఖంకడుక్కోడానికి. పార్వతి నడకలో మునపటి వయ్యారంలేదు. ముఖంలో ఏదో వింత కాంతి, మెరుపు కనిపిస్తున్నాయి. కనకమ్మకి శివరామయ్య దగ్గిర కొంచెం చనువు తక్కువైనా, ఇంటికి అడదిక్కు ఆవిడేకనుక పార్వతి గర్భవతిగా నున్నసంగతి తెలియజేసింది. బోసిగావున్న ఇంట్లోకి కిలకిలలాడే మనుమడు వస్తాడన్న సమాచారం ఆయనకి చాలా ఆనందాన్ని కలుగజేసింది. శేఖర్ వచ్చి పార్వతి తల్లిదండ్రులను పిలిపించమంటోందని చెప్పాడు. "అవును బాబూ! ఈ సమయంలో ప్రతి ఆడపిల్లా తల్లిదగ్గర వుండాలని కోరుకుంటుంది. ఇవాళే మనిషిని పంపుతా"నన్నారాయన. శేఖరంఆశ్చర్యంగా చూడ్డం గమనించి "నాకు మనుమడు పుట్టబోతున్నాడురా" అన్నాడు.

ఆనందంలో ఆ అన్నమాటతప్ప వేరేమీ అతనినోట వెలువడలేదు. శేఖరం పరుగున పార్వతిదగ్గరచేరి "దొంగపిల్లా! ఇంతచక్కని శుభవార్త దాచిపెట్టి నా దగ్గర తలనెప్పని చెపుతావా. చూడు నీకేం శిక్షవిధిస్తానో" అంటూ ఆమెను మాణిక్యవీణలా వాళ్ళో వేసుకుని ప్రేమధారలలో ముంచేశాడు. సిగ్గుతో నోరువిప్పలేదు పార్వతి.

యోగానందం, రాజేశ్వరమ్మా వచ్చి పార్వతిని పుట్టింటికి తీసుకెళ్ళారు. శేఖరానికి పార్వతినివదిలి వుండాలనిపించలేదు. ఏదైనాఅంటే ఎగతాళిచేస్తారేమోనని వూరుకున్నాడు. తరచూ వచ్చి చూస్తూంటానని ప్రమాణం చేశాడు పార్వతికి. రాజు వేళాకోళానికి అంతులేదు. "ఏమే పారూ - నీక్కూతురు పుడితే నాకిస్తావా" అనేవాడు. అన్న అంటున్నాడు గదా అని బడేళ్ళ ప్రకాశంకూడా "నాకిస్తావా" అనేవాడు.

తొమ్మిది నెలలు నిండాయి. ఒకానొక ఉదయాన కూతుర్ని కన్నది పార్వతి. మనుమడే పుడతాడనుకున్న శివరామయ్య అందంగా ఆరోగ్యంగావున్న మనుమరాల్ని చూసి మురిసిపోయేవారు. ప్రసవమైన రెండోరోజున పురిటి సంధివచ్చి తనని ప్రాణంగా చూసుకుంటున్న ప్రియవరివారాన్ని విడిచి మరోలోకానికి వెళ్ళిపోయింది పార్వతి. ఆయింట్లో శోకదేవత తాండవమాడింది. రాజు ఏడుపుకి అంతేలేదు. అంతవరకు చెల్లెలికూతుర్ని చూసి మురిసిన రాజు పసిపిల్ల ఏడుపు విన్పిస్తే చాలు విసుక్కునేవాడు. బంగారంలాంటి నాచెల్లెల్ని మింగావే అని చీదరించుకునే

---



*స్టేజీ వెనకాల, ఒక నటుడు డ్రామా కంట్రాక్టరుదగ్గిర కొచ్చి: "కొంప మునిగిందండోయ్. ఆఖరిసీను జరుగుతోంది. హీరో, విలను యుద్ధం చేస్తున్నారు. మీరు వెంటనే పాతబాకీ చెల్లించకపోతే చావనంటున్నాడు విలన్."*

వాడు, అన్నీ తెలిసినరాజు కూడా చెల్లెలి మరణానికి పసిపిల్లే కారణమనేవాడు.

కూతురి చావు తిరుగులేని దెబ్బగా వారిని బాధిస్తున్నా మనవరాలి పెంపకంలో లోటు చేసేవారుకాదు. రాజుకి ఆ పసిపిల్ల యింట్లో వుండడమే యిష్టంలేదు. శేఖరం "పారూ! ఈ చిన్నదాన్ని అనంతమైన ఈ లోకంలో వదిలి నన్నన్యాయం చేసి వెళ్ళిపోయావా" అని చాటుగా ఏడ్చేవాడు. పార్వతిలేని యిల్లు దీపంలేని గూడులా వుందని పిల్లని తెస్తే మనశ్శాంతి వుంటుందని అత్త మామల్ని వొప్పించి రెండేళ్ళ కూతుర్ని తెచ్చేశాడు. రాజు ఏదో భారం తగ్గిన వాడిలా హాయిగా వూపిరిపీల్చాడు. ప్రకాశానికి పాపవెళ్ళాక అల్లరి తగ్గిపోయింది.

పార్వతి కోర్కె ప్రకారం విద్యావతి అనే పిల్చేవాడు శేఖరం పాపని విద్య అట పాటలలో కిలకిలనవ్వులతో కొంతబాధని మరువగలిగాడు. అన్నివేళలా కనకమ్మ విద్యని కనిపెట్టుకునివుండి తల్లిలాగే పెంచింది. విద్యకి ఐదు సంవత్సరాలు నిండాయి. విద్యాభ్యాసం చేయించాలని ఘనమైన ఏర్పాట్లుచేశారు శివరామయ్యగారు. పిలువందుకుని రాజేశ్వరమ్మ, యోగానందం, ప్రకాశం వచ్చారు. రాజు ససేమిరా రానుపొమ్మన్నాడు. అయ్యవారు రావడం, అక్షరాలు దిద్దబెట్టడం, పిల్లలకి మిఠాయిలు, పలకా బలపాలూ పంచడం జరిగాయి. విందుకూడా గొప్పగా జరిగింది.

ఆనాడు హాల్లో కూర్చుని అందరితో కబుర్లాడుతున్న శివరామయ్య అమ్మా అంటూ గుండెమీద చెయ్యేసుకుని అలాగే వొరిగిపోయాడు. ఆనందోత్సాహాలతో మూరుమోగుతున్న యిల్లు ఏడుపులతో నిండింది. పట్టుపరికిణీ రెపరెపమంటూంటే "అక్షరాలు చూడంటూ" వచ్చింది విద్య. "ఇంకెక్కడి తాతయ్యమ్మా" అంటూ గొల్లుమన్నాడు శేఖరం. ఆ చిన్నహృదయానికి తాతయ్య లేడనే సంగతి కొంతవరకు బోధపడింది. ఏడ్చి రాగాలుపెట్టింది. తాతయ్యతో నేనూ పోతానంటూ ఎంతమందిపట్టుకున్నా ఆగలేదు. సంతోషంగా వచ్చిన యోగానందం దంపతులు విచారంతో వెనక్కుమళ్లారు.


అంతా తెలుసుకున్న రాజు "నాకు తెలుసు! అది అందర్నీ మింగడానికే పుట్టింది. పుట్టగానే నా బంగారు చెల్లిని పొట్టన బెట్టుకుంది. అక్షరాభ్యాసం నాడు తాతయ్యని మింగింది. ఇంకా యెంతమందిని భక్షిస్తుందో మహాతల్లి" అన్నాడు ఏవగింపుగా. అతని కంఠం దుఃఖంతో పూడిపోయింది చెల్లెలితలపుతో.

"ఊరుకో నాయనా! అవేంమాటలు. నువ్వే అలా అంటే లోకులసంగతిచెప్పాలా వేరే! అది పసిపిల్ల. అదేం చేసిందికనుక! నాతల్లిని చూసుకునే అదృష్టం నాకు లేకపోయింది. దానిదారి అది చూసుకుం"దని వెక్కి వెక్కి ఏడ్చింది రాజేశ్వరమ్మ.

అంతా వింటున్న ప్రకాశం చిన్న హృదయంలో విద్యంటే ఏదోజాలికలిగింది. విద్యకన్నా ప్రకాశం ఆరేళ్ళు పెద్దవాడు. ఆ రోజ్లాసు చదువుతూండేవాడు. అప్పుడప్పుడూ రాజేశ్వరమ్మే వెళ్ళి విద్యను పిలుచుకొచ్చేది. లేనా శేఖరమే విద్యని అమ్మమ్మగారింట్లో దింపేవాడు. ఎంతో స్నేహంగా వుండే రాజు ముభావంగావుండేవాడు శేఖరంతో. అందుకే అత్తగారింట్లో వుండాలన్పించేదికాదు శేఖరానికి. రాజుకి విద్యంటే నిరసనే. అసలు పలకరించేవాడుకాదు. "పెద్ద మామయ్య నాతోమాట్లాడడేం అమ్మమ్మా" అనడిగేది విద్య అమాయకంగా. ఆవిడేం చెప్పగలదు కనుక! ప్రకాశం విద్య చదువు సంధ్యలను గూర్చి కనుక్కునేవాడు. తోటల్లోకి షికార్లు తిప్పేవాడు.

కొంతకాలానికి రాజుకు వివాహమైంది. పెళ్ళికి విద్యని పంపలేదు శేఖరం. రాజు భార్య రమణి కాపరానికి వచ్చింది. అప్పటికి రమణికి పందొమ్మిదేళ్ళు. విద్యకి పధ్నాలుగు. తనభార్య, విద్య కలిసిమెలిసి తిరగడం యిష్టంగావుండేదికాదు రాజుకి. ఎప్పుడైనా రమణి, విద్య నవ్వుకుంటూ కబుర్లుచెప్పుకుంటే రాజు చిటపటలాడేవాడు. ఒకసారి రమణి అడిగింది సంగతేమిటని. అన్ని తెలుసుకున్న తర్వాత విద్యంటే ఆపేక్ష ఎక్కువయింది రమణికి. రాజు విద్యని మా యింటి దేవతను మింగిన మహంకాళి అని చీదరించుకోవడం నచ్చలేదు రమణికి. ఎదురుచెప్పే ధైర్యంలేక వూరుకున్నది రమణి.





ఆనాడు విద్య పుట్టినరోజు. తలంటిపోసి. కొత్తబట్టలు కట్టబెట్టింది రాజేశ్వరమ్మ. ఆ సందర్భంగా ఏ వేడుకలూ జరుగరాదని పట్టుపట్టాడు రాజు. చేసేదిలేక వూరుకుంది రాజేశ్వరమ్మ. మర్నాడు వ్యక్తురాలయింది విద్య. ఉన్న ఒక్క ఆడపిల్లకీ ముచ్చట్లు జరపకపోవట మేమిటని రాజు ఎంత పంతగించినా వినకుండా పేరంటం జరిపింది. నాల్గోనాడు బంతి ఏర్పాటుచేసింది. తోటి పిల్లల ఎగతాళికి తట్టుకోలేకపోతోంది విద్య. అందర్నీ మందలించింది నవ్వులాటగా రాజేశ్వరమ్మ.

ఇప్పుడు పార్వతిలాగే వున్నది విద్య. పచ్చి కాటాకుకోసం తోపుకెళ్ళిన యోగానందంగారిని కోడెతాచు కాటేసింది. చుట్టూ పనిచేస్తున్న పాలేర్లు చేతులమీద యోగానందంగార్ని యిల్లుచేర్చారు. మంత్ర తంత్రాలు ముగిసేలోగానే దాటిపోయారు యోగానందంగారు. బంతికోసం జరిగే ఏర్పాట్లు శ్రాద్ధంకోస మయ్యాయి. రాజేశ్వరమ్మకు తెలివేలేదు. రమణి పరిచర్య చేస్తోంది అత్తగారికి. రాజు పిచ్చెక్కినవాడికి మల్లే "చెవితే విన్నావా అమ్మా! దాన్ని పిల్చుకొచ్చి ఇంట్లో వుంచావు. వద్దన్నా వినకుండా వేడుకలన్నావు. కన్న తల్లినీ తాతయ్యలిద్దర్నీ ఇలాగే పొట్టనబెట్టుకుంది చండిక. దాన్నిప్పటికైనా వదిలించు. లేకపోతే ఇంకా ఎంతమంది కావాల్సివస్తారో దాని ఆకలి తీర్చడానిక"ని కేకలువేశాడు రాజు. ప్రకాశం అన్నకి నచ్చచెప్పాలని చూశాడు. దాంతో రాజు యింకా పేట్రేగిపోయాడు. ఎలాగో కర్మకాండ పూర్తి చేశాడు రాజు.

అన్నీ విన్న విద్యగుండెల్లో శూలాలు గుచ్చినట్లయింది. తనవల్లనా యింతమంది చనిపోయింది! అందుకే నేనంటే పెద్ద మామయ్యకి యిష్టంలేదు కాబోలనుకున్నది విద్య. ఏడుపుల్లో విద్య సంగతెవరూ పట్టించుకోలేదు. ప్రకాశం జాగ్రత్తగా వున్నాడు. విద్య మునుపటిలాగా చిన్నపిల్ల కాదు. జ్ఞానంతెల్సినపిల్ల. అన్నీ విన్నది. ఏం అఘాయిత్యం చేసుకుంటుందోనని.

ఎవ్వరూలేనిచోట కూర్చుని ఆలోచిస్తోంది విద్య. అసలు తనెందుకు బ్రతికివుండాలి ఇప్పటికే తన నష్టజాతకంవల్ల కుటుంబంలో ముఖ్యమైనవాళ్ళు మరణించారు. తన్నందరూ మహమ్మారిలా చూస్తున్నారు. ఇంతకన్నా చావడం మేలనుకున్నది. మెల్లిగా లేచి తోటలో మోటబావిదగ్గరకు చేరింది. లోతైనబావి. నీళ్ళు చూస్తూంటే గుండె జల్లుమని వెనక్కుతిరిగింది. మళ్ళీ రాజు మాటలు చెవుల్లో రింగుమన్నాయి.

ఇక్కడ ప్రకాశం విద్యకోసం చూస్తే యింట్లో కనపడలేదు. తల్లి నడిగితే తెలీదన్నది. రాజు "పీడా వదిలింది గ్రహం" అని విసుక్కున్నాడు. రమణి మరిదితో "ఇందాక తోటలోకి వెళ్ళింది. చీకటిపడింది. ఏమో! బాబూ పిల్చుకురా" అంటూ బ్రతిమాలింది. తోట, ఒక్కర్తె అన్నపదం వినపడగానే రివ్వున బావిదగ్గరకు వెళ్ళాడు. ప్రకాశం.

అప్పటికే విద్య నీళ్ళలో దూకేసింది. "విద్యా యెంతపని చేశా"వంటూ తనూ దూకాడు ప్రకాశం. అరుపులూ, శబ్దం వినపడి పనివాళ్ళుబావిదగ్గరికివచ్చారు. చిన్నప్పట్నుంచీ ఈతల్లో ఆరితేరిన ప్రకాశం తెలివిగానేవున్నాడు. భయపడిన విద్యకి స్పృహ





తప్పింది. ఎలాగో యిల్లుచేరారు. "మీరందరూ కలిసి దాని పసి మనసు విరిచేశారు. అది యెంత కష్టపెట్టుకోకపోతే ఆత్మహత్యకి పూనుకుంటుంది? అక్కయ్యా, మామయ్యగారు, నాన్న పోవడానికి అదేనా కారణం? ఏళ్ళు రాంగానే సరా? వివేకం లేకపోయాక! ఇకనైనా దాన్ని సరిగ్గా చూడండి" అనిరూక్షంగా అన్నవంక చూసి లోపలికి పోయాడు దుస్తులు మార్చుకోడం కోసం.

బట్టలు మార్చి తల తుడిచింది రమణి. వేడివిప్పులలో సాంబ్రాణి వేసి తల ఆరపెట్టింది రాజేశ్వరమ్మ. రాజు "విద్యా! నిన్నెన్ని మాటలన్నాను తల్లీ! నిజంగా యివ్వాళ నువ్వే చచ్చిపోయివుంటే చెల్లి నన్నెంత శపించేదో గదా! నా అజ్ఞానం మన్నించమ్మా" అన్నాడు విద్య నుదుటిమీద చెయ్యివేసి. రాజువంక ఆశ్చర్యంగా ఆనందంగా చూసింది రమణి. కొంతసేపటికి తెలివి వచ్చిన విద్య భోరుమని ఏడ్చేసింది.

మామగారి చావు తెలిసి వచ్చిన శేఖరం యివన్నీవిని "మనం ఇక్కడవుండద్దు తల్లీ, పార్వతిజీవితానికి ప్రతిబింబంగా నిన్నుచూసుకుంటున్నాను. నువ్వు నన్నన్యాయం చేసిపోతావా" అన్నాడు. "నాన్నా" అంటూ తండ్రిమీద వాలిపోయింది విద్య. ఆతర్వాత విద్య. శేఖరం వెళ్ళిపోయారు. కొత్తబట్టలు యిచ్చింది రమణి. "జాగ్రత్తగా చదువుకో విద్యా! అనవసరమైన ఆలోచనలు చెయ్యకు" అన్నాడు ప్రకాశం.

ఇదంతా జరిగి రెండేళ్ళయింది. మళ్ళీ యిప్పుడు వస్తున్నాడు శేఖరం అత్తవారి వూరికి. కూ మనే రైలుకూతతో ఆలోచనల్నుంచితెమిలి బైటపడి రైల్లోంచి దిగుతున్న శేఖరం వైపుగా నడిచింది రాజేశ్వరమ్మ. శేఖరం వెనకాలే దిగిన విద్యను ప్రేమగా కౌగలించుకున్నది. సన్నగావుండే విద్యవొళ్ళుచేసి బంగారు బొమ్మల్లేవున్నది పార్వతే మళ్ళీ వచ్చిందాఅన్నంత భ్రమ కలిగించింది. రమణికి విద్యను చూచేసరికి చాలా సంతోషం కల్గింది. రాజు పలకరించి వెళ్ళిపోయాడు పనివుందంటూ.

మరి రెండురోజులకి ప్రకాశం వచ్చాడు పరీక్షలు ముగించుకుని. విరిసిన పువ్వల్లే వున్న విద్యను చూసి ముచ్చటపడ్డాడు ప్రకాశం. సాయంత్రం చల్లగాలికి తోటలో కూర్చుని చదువుకుంటోంది విద్య. అటు వేపుగా వచ్చిన ప్రకాశం విద్యచేతిలోని ఇంగ్లీషు నవలచూసి ఆశ్చర్యపోయాడు. యింగ్లీషు నవలలు అర్థంచేసుకునే జ్ఞానం సంపాదించుకున్నందుకు మనసులో అభినందించాడు విద్యని. వెనుకగా వెళ్ళాడు ఏం చదువుతోందో చూద్దామని. సోమర్సెట్ మామ్ రాసిన "హ్యూమన్ బాండేజ్" చదువుతోంది.

వెనుక పదధ్వనికి వులికిపడి లేచింది విద్య. "కూర్చో విద్యా! త్రుళ్ళిపడ్డావేం" అన్నాడు ఆమె సరనే కూర్చుంటూ. విద్యకి ప్రకాశందగ్గర తగినంత చనువుంది. రెండేళ్ళతర్వాత చూస్తున్నందుకు కొంచెం సిగ్గనిపించింది. పైగా ప్రకాశం మునుపులాగా లేడు. చాలా మారిపోయాడు. వయస్సు తెచ్చిన మార్పే అది.

"బావ పెళ్ళిచేస్తానంటున్నాడు నీకు విద్యా" అన్నాడు సూటిగా. "నన్నెవరు చేసుకుంటారు మామయ్యా: నే నందర్ని

చంపడానికే పుట్టానంటారుగా" అన్నది కన్నీటితో గొంతుపెగల్చుకుని. ఆమె బేలతనానికి కరిగిపోయాడు ప్రకాశం. "అవేం మాటలు విద్యా! నీ పుట్టుకకి, ఒకరి చావుకి ఏం సంబంధం వున్నది. చదువుకున్నదానివి. అన్నీ తెలిసినదానివి, అలా బాధపడతావేం" అన్నాడు ఓదారుస్తూ. "నన్నెవరయినా జాలిపడి చేబట్టి నాన్న దిగులు తీరిస్తే వాళ్ళకి జన్మంతా ఋణపడి వుంటాను" అన్నది విద్య. "అహా! మాటలు చాలానేర్చావే! ఋణపడి వుండక్కర్లేదులే చక్కగా సంసారం చేసుకుంటూ పిల్లలతో కళకళలాడుతూంటే అదే చా"లన్నాడు ప్రకాశం. సిగ్గుపడింది విద్య. "లే విద్యా పోదాం" అన్నాడామె చేయి పుచ్చుకుని. జల్లుమన్నది విద్య శరీరం. ఇంతకుమునుపెన్నిసార్లు మామయ్య తనను తాకలేదుగనుక! ఇలాంటి మధురసంచలనం ఎన్నడూ రాలేదే అనుకున్నది విద్య.

సంధ్యచీకట్లు అలముకుంటున్నాయి. చెట్లమధ్య చీకటి దట్టంగా వ్యాపించింది. చేతిలోచేయివేసి నడుస్తున్న ప్రకాశం విద్యను తన హృదయంమీదకు చేర్చుకుని బలమైన తన కౌగిలిలో పొదువుకుని "విద్యా! నీ కన్న చక్కనిది, గుణవంతురాలైన అమ్మాయి ఎక్కడైనా వుంటుందా! నిన్ను జారవిడుచుకునేంత అవివేకినిగాను. నువ్వు నాదానివే" నన్నాడు. మొదట విద్య కంగారుపడినా బలమైన బాహువులు తనకి అభయమిస్తున్నట్లుగా తోచేసరికి అందులోని హాయి, నిబ్బరం అనుభవించింది. "నేనంటే నీ కెందుకింత దయ మామయ్యా! చిన్నప్పటినుంచీ రాజు మామయ్య చీదరించుకున్నా నువ్వే చేరదీసేవాడివి. నేనేంచేసినా నీ ఋణం తీర్చుకోలేను. ఎందుకు నీ కింత ప్రేమ నేనంటే" అన్నది జీరబోయిన గొంతుతో.

"దయాలేదూ, ఋణమూ లేదు. అట్లాటి మాటలు చెప్పకు. ఇంక నిశ్చింతగా వుండు విద్యారాణీ'' అన్నాడు చిలిపిగా. సిగ్గుపడి, యిల్లు సమీపిస్తోందని ఆతనినుంచి విడివడి ముందుగా యిల్లుచేరింది విద్య. శేఖరంతో ముందుగా మాట్లాడాడు ప్రకాశం. ప్రకాశం వంటి వానిచేతిలో విద్యను పెడితే తనకేం దిగులుండదు. ఆనందంగా అంగీకరించాడు శేఖరం. తర్వాత తల్లితో చెప్పాడు. ఆలోచించి చివరకు సరేనంది రాజేశ్వరమ్మ. రాజు ఏమీ అనలేదు. రమణి మాత్రం ముడిసిపోయింది. ఇంక విద్య యెప్పటికీ తనతోనే వుంటుందిగదా అని.

అన్నీ నిశ్చయమయ్యాక విద్య ప్రకాశానికి కనపడ్డమే మానేసింది. "ఈసిగ్గు ఎన్నాళ్ళో చూస్తాను" అని నవ్వుకున్నాడు ప్రకాశం. శేఖరం వైభవంగా వివాహం చేశాడు. ఉన్నదంతా విద్యదేననీ, విద్యని ప్రకాశానికి అప్పగించి బరువుతీరిన వాడిలా వెళ్ళిపోయాడు శేఖరం.

తర్వాత నాల్గునెలలకి వేడుక జరుగబోతోంది యింట్లో. రమణికి సూడిదలివ్వబోతున్నారు. బంధువర్గమంతా చేరారు. అంతులేని కోలాహలం. విద్య రమణిని విడిచి వుండడంలేదు. విద్యని పిలిచి ప్రయాణం కమ్మన్నాడు ప్రకాశం. తెల్లబోయింది విద్య. ఈవేడుక సమయంలో రమణిని విడువడానికి సుతరామూ యిష్టం లేదు విద్యకి

తల్లితోచెప్పి ప్రకాశం విద్యను తీసుకుని మద్రాసువెళ్ళాడు. విద్యకి మద్రాసు చూపించాలనే మిషతో. రాజుకేమీ తెలీదు. బంధువర్గంవాళ్ళు ఆశ్చర్యపోయారు. ఎవ్వరూ ఎక్కువ తర్కవితర్కాలు చేయలేదు. ఆ రాత్రి ప్రకాశం విద్యతో "నీకు రావడానికి చాలా కష్టమనిపించిందిగదూ విద్యా! కానీ పరిస్థితుల దృష్ట్యా మనం అక్కడ వుండడం నాకే యిష్టంలేకపోయింది. ఏవో వేడుకలంటున్నారు. ఖర్మంజాలక ఏమన్నా జరిగితే నిన్నంటారు. నువ్వు బాధపడతావు. అన్నిటికన్నా యిలా ఈ హోటల్‌గదిలో ఏకాంతంగా వుండడమే నాకు బాగుంది. అయినా వేడుకలన్నీ నీకూ జరుపుతారుగా. తొందరెందుకూ!" అన్నాడు.

"ఊరుకో! మామయ్యా! అల్లరిమాటలు'' అనిమాత్రం అన్నది విద్య. మామయ్యది యెంత దూరదృష్టి. తనంటే ఎంత ప్రేమ. ఇదంతా తన అదృష్టమేననుకున్నది విద్య. తన అదృష్టాన్ని లిఖించిన భగవంతునికి చేతులు జోడించి ''ఎంత దయామయుడివి ప్రభూ! కఠినులైన మనుష్యులతోపాటు కరుణామయులను కూడా సృష్టిస్తుంటావు. నీ లీల లెంత వింతైనవి'' అంటూ నమస్కరించి తృప్తిగా, నిశ్చింతగా ప్రకాశం కౌగిలిలో నిద్రపోయింది విద్య.



□□□